క్లుప్తంగా

ధాన్యం సేకరణలో సర్కార్ విఫలం


మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు: తొలి పంట ధాన్యం సేకరణలో కూటమి సర్కార్ విఫలమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు స్పష్టం చేశారు. నార్తురాజుపాళెంలోని వీసీఆర్ అతిథి గృహంలో బుధవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో 4.20 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తే సుమారు 16 లక్షల పుట్ల దిగుబడి వచ్చిందన్నారు. ఇందులో కొనుగోలు కేంద్రాల ద్వారా కేవలం లక్షా 15 వేల 400 పుట్లు మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో 1.25 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తే 5 లక్షల పుట్ల దిగుబడి వచ్చిందన్నారు. ఇందులో కేవలం 42,300 పుట్లు మాత్రమే కొనుగోలు చేశారని చెప్పారు. దీనికే తామేదో రైతులను ఉద్ధరించినట్లు కూటమి నేతలు సంబరాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందని చెప్పారు. రైతుల పట్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో వ్యవహరించిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు పెట్టుబడి సాయం కూడా ఇవ్వకుండా అన్నదాతలను విస్మరిస్తోందన్నారు. కాగా రెండో పంటకు నీరు ఎప్పుడిస్తారో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారని, వారికి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు మావులూరు శ్రీనివాసులురెడ్డి, చిమటా శేషగిరి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్ రెడ్డి, సీహెచ్.సతీష్‌రెడ్డి, సర్పంచ్‌లు బి.సుప్రియ, ఎం.రంగారెడ్డి, నాయకులు బట్టేపాటి నరేంద్రరెడ్డి, కొండా శ్రీనివాసులురెడ్డి, ఆర్.మల్లికార్జునరెడ్డి, ఎస్.నరసింహులురెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పరామర్శ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని రాఘవ రెడ్డికాలనీ వద్ద విధి నిర్వహణలో ఉండగా లారీ ప్రమాదానికి గురై నెల్లూరు నారాయణ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న పారిశుద్ధ్య కార్మికులను మండల సీఐటీయూ, సీపీఎం నాయకులు బుధవారం పరామర్శించారు. బాధితులకు ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చల్లకొలుసు మల్లికార్జున, పి.శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

శాస్త్రోక్తంగా స్తంభ ప్రతిష్ట



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో మే 17 నుంచి జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో స్తంభ ప్రతిష్ట కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ వేద పండితులు ముఖ మండపం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం స్తంభ ప్రతిష్ట చేశారు. ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంతో నిమ్మతోటలకు ఊరట

పొదలకూరు : ఎండ వేడిమితో అల్లాడుతున్న నిమ్మతోటలకు బుధవారం కురిసిన జోరువాన కొంత ఊరట కలిగించింది. గాలి, అకాల వర్షం కురిసినా తోటలు, పంటలకు ఎలాంటి నష్టం వాటిల్ల లేదు. మండలంలో వరి పంట నూర్పిడి పనులు పూర్తి కావడంతో అకాల వర్షం, గాలి వల్ల ఇబ్బందులు తలెత్తలేదు.

లైంగికదాడులను అరికట్టేందుకు యాత్ర


పల్లిపాడుకు చేరిన యాత్ర

ఇందుకూరుపేట : మహిళల భద్రత, గౌరవంతో పాటు బాలికలపై లైంగికదాడులను అరికట్టేందుకు జాగ్తే రహో భారత్‌యాత్ర చేపట్టినట్లు రాజేంద్రప్రసాద్ యాదవ్ అన్నారు. దేశమంతా యాత్ర చేపట్టిన ఆయన బుధవారం మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగికదాడులను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. తొలుత ఆశ్రమ కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డితో కలిసి గాంధీ విగ్రహానికి, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యుడు గణేశం సుమంత్ రెడ్డి, మేనేజర్ మనోజ్ పాల్గొన్నారు.

జీవనాధారం.. కాలుష్యమయం

- మృత్యువాత పడుతున్న మత్స్యసంపద
- హేచరీలు, స్థానిక పరిశ్రమల వ్యర్థ జలాలతో కలుషితం
- ఆందోళనలో తీరప్రాంత మత్స్యకారులు

మత్స్యకారుల వేట విరామ సమయంలో, ఏమైనా విపత్తులు వచ్చినప్పుడు జీవనాధారంగా ఉన్న కోదూరు తీరప్రాంతంలోని ఉప్పుకాలువ(బకింగ్‌హామ్ కెనాల్), పాతపట్టుపుపాళెం క్రీక్‌లు పరిశ్రమల వ్యర్థ జలాలతో కలుషితమవుతున్నాయి. ఫలితంగా వాటిలో ఉన్న మత్స్యసంపద నిలువునా మృత్యువాత పడుతోంది.


కోదూరు సమీపంలోని ఉప్పుకాలువ

తోటపల్లిగూడూరు : మండలంలోని తీరప్రాంత గ్రామాలైన కోదూరు, వెంకన్నపాళెం పంచాయతీల్లో పది మత్స్యకార గ్రామాలున్నాయి. ఆయా మత్స్యకార గ్రామాల్లో ఐదు వేలకుపైగా కుటుంబాలు చేపల వేటనే జీవనాధారం చేసుకుని జీవిస్తున్నారు. ఈ క్రమంలో వరుస తుపాన్లు, వాయుగుండాలతో వేట సక్రమంగా సాగడం లేదు. కాగా ఈనెల 15వ తేదీ నుంచి సముద్రంలో చేపలవేటను ప్రభుత్వం నిషేధించింది. ఈ క్రమంలో సముద్రాన్ని ఆనుకొని ఉన్న ఉప్పు కాలువలో చేపలవేటతో మత్స్యకారులు కొంత ఉపశమనం పొందాల్సి ఉంది. అయితే వేటకు పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వ్యర్థజలాల మూలంగా ఉప్పు కాలువలో చేపలవేటకు గ్రహణం పడుతోంది.

కాలువల్లోకి వ్యర్థ జలాలు

తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల తీర ప్రాంతాల్లో పలు విద్యుత్ పరిశ్రమలు, ఆక్వా హేచరీలు కొలువుదీరాయి. వీటి నుంచి రోజూ విషపూరితమైన రసాయన, వ్యర్థ జలాలు విడుదలవుతుంటాయి. వీటిని పరిశ్రమల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా పెద్దపెద్ద గొట్టాల ద్వారా సముద్రంలోకి, ఉప్పు కాలువల్లోకి వదులుతున్నారు. దీంతో సముద్రంతో పాటు ఉప్పుకాలువ సైతం కలుషితమై కాలువలోని మత్స్య సంపద మృత్యువాత పడుతోంది. అలాగే పాతపట్టుపుపాళెం సమీపంలో ఉన్న క్రీక్‌లో కూడా కలుషిత నీరు చేరి అందులో టన్నుల కొద్ది చేపలు హరించుకుపోతున్నాయి. ప్రస్తుతం వేట విరామం కావడంతో మత్స్యకారులు సముద్రపు వేటకు దూరం కావాల్సి వచ్చింది. ఈ పరిస్థితిలో కాస్త ఆసరాగా నిలుస్తున్న ఉప్పుకాలువ, పాతపట్టుపుపాళెం క్రీక్‌లు ఇలా కలుషితమై చేపలు మృత్యువాత పడడంతో మత్స్యకారులు తీవ్ర ఆవేదనకు గురికావాల్సి వస్తోంది.

ముఖ్యంగా గత కొంత కాలంగా తీరం వెంబడి ఉన్న వివిధ పరిశ్రమల నుంచి ఉప్పు కాలువకు భారీ ఎత్తున విషపూరితమైన రసాయన, వ్యర్థ జలాలు విడుదులవుతున్నట్లు స్థానికులు చెప్పుకొస్తున్నారు.

మా పొట్టకొట్టడానికే పరిశ్రమలు



వ్యర్థ జలాలు, రసాయనాలతో ఉప్పుకాలువ కలుషితమవుతోంది. సముద్రంలో వేట లేకపోయినా ఉప్పుకాలువలో వేటపై జీవిస్తున్నాం. కంపెనీల నుంచి వచ్చే వ్యర్థ రసాయనాలతో ఉప్పుకాలువలో ఉన్న మత్స్యసంపద మొత్తం తుడుచు పెట్టుకుపోతోంది. మా పొట్ట కొట్టడానికే తీరం వెంబడి పరిశ్రమలు వచ్చినట్లు ఉంది.

– పామంజి దుర్గ, మత్స్యకారుడు, కొత్తపట్టపుపాళెం

కంపెనీలపై చర్యలు తీసుకోవాలి



కోదూరు తీరం వెంబడి వెలసిన విద్యుత్ పరిశ్రమలు, హేచరీల మూలంగా ఉప్పు కాలువ, పాతపట్టపుపాళెం క్రీక్‌లు కలుషితమవుతున్నాయి. దీంతో మా ప్రాంతాల్లో పుష్కలంగా దొరికే మత్స్య సంపద పూర్తిగా హరించుకుపోతోంది. నిబంధనలకు విరుద్ధంగా విషపూరిత రసాయనాలను ఉప్పుకాలువలోకి వదులుతున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలి.

– కంజి శ్రీరాములు, మత్స్యకారుడు, పాతపట్టపుపాళెం


వ్యర్థ జలాలతో కలుషితమైన పాతపట్టపుపాళెం సమీపంలోని క్రీక్




వ్యర్థ జలాల ప్రవాహంతో మృత్యువాత పడిన చేపలు

మర్యాదపూర్వకంగా..


ప్రసన్నకు అభినందనలు తెలుపుతున్న చెల్లాయపాళెం నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీలో సభ్యుడిగా నియమితులైన కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని చెల్లాయపాళెం వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి మొక్కను అందజేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బుచ్చి మండల జనరల్ సెక్రటరీ కె.వెంకయ్య, సోషల్‌మీడియా కన్వీనర్ ఆదిశేషయ్య, మస్తాన్, మణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న గుణశేఖర్

కొడవలూరు : నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల్లో 3డే ఫెస్ట్‌లో భాగంగా క్రీడా పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, గౌరవాధ్యక్షురాలు శ్రీలక్ష్మి పాల్గొని, క్రీడా జ్యోతిని వెలిగించారు. ఖోఖో, కబడ్డీ, పరుగు పందెం తదితర క్రీడా పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సి.ప్రకాష్ రావు, ఎన్‌సీసీ సీటీఓ సీహెచ్.సతీష్, పీడీలు యాసిన్, ఫణికుమార్, ఎన్‌సీసీ పీఓ రవికుమార్, ఏఓ గిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో దంత పరీక్షలు



పొదలకూరు : ప్రపంచ నోటి ఆరోగ్య మాసోత్సవాల సందర్భంగా స్థానిక సీహెచ్‌సీలో బుధవారం దంత పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్య నిపుణురాలు డాక్టర్ రాధ పలువురికి దంతాలపై అవగాహన కల్పించారు. అత్యాధునిక పద్ధతిలో దంత పరీక్షలను చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం పేస్టులు, మౌత్‌వాష్‌లను అందజేశారు.

శివపార్వతులకు వసంతోత్సవం


ఎడ్ల బండిపై స్వామి దంపతులు

మనుబోలు : సంగమేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా నూతన దంపతులైన శివపార్వతులకు బుధవారం వసంతోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక శివాలయంలో అర్చకుడు సాయిశర్మ వేద మంత్రోచ్చారణల మధ్య నూతన దంపతులకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఎడ్ల బండిపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువతలు ఒకరిపై ఒకరు వసంతాలు చల్లుకుని కేరింతలు కొట్టారు.

నగర వనంలో నేచర్ క్యాంప్


విద్యార్థులకు ప్రశంసాపత్రాల పంపిణీ

పొదలకూరు : నెల్లూరులోని నగర వనంలో నేచర్ క్యాంపునకు స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాయ్స్ హైస్కూల్ నుంచి విద్యార్థులు బుధవారం వెళ్లారు. డీఈఓ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 11 పాఠశాలల నుంచి విద్యార్థులు, 50 మంది ఉపాధ్యాయులు నేచర్ క్యాంపునకు వెళ్లారు. పొదలకూరు పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు, ఎన్జీటీ కో–ఆర్డినేటర్ ఏవీ సుధాకర్ ఎంపికై వెళ్లారు. పర్యావరణ, వన్యప్రాణుల సంరక్షణ, జీవవైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు జిల్లా కో–ఆర్డినేటర్ కె.భక్తవత్సలబాబు నాయుడు వెల్లడించారు. పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

అగ్నిప్రమాదాలపై మహిళలకు అవగాహన



పొదలకూరు : అగ్ని ప్రమాదాలపై పొదలకూరు ఫైర్‌స్టేషన్ అధికారి విజయ వరకుమార్ పట్టణంలోని నివాస ప్రాంతాల వద్ద మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వంటగ్యాస్ వాడకం, గ్యాస్ వల్ల కలిగే అగ్ని ప్రమాదాలను వివరించారు. వంట గ్యాస్ లీకైనా, మంటలు వ్యాపించినా వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

లారీపై నుంచి పడి క్లీనర్ మృతి


మోహన్ మృతదేహం

కోవూరు : లారీపై నుంచి పడి క్లీనర్ మృతిచెందిన ఘటన కోవూరు సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మహారాష్ట్రలోని థానేకు చెందిన క్లీనర్ మోహన్ గైక్వాడ్(28), డ్రైవర్ సుభాష్ కలిసి ఈనెల 12వ తేదీన ముంబై నుంచి కోవూరులోని ఫెడోరా కంపెనీకి ఓ లారీలో చేపల మేత తీసుకుని బయల్దేరారు. ఇది మంగళవారం రాత్రి ఇక్కడికి వచ్చింది. బుధవారం ఉదయాన్నే అన్‌లోడ్ చేసేందుకు పక్కనే లారీని పార్కు చేశారు. ఇద్దరూ లారీలోనే నిద్రపోయారు. అయితే బుధవారం ఉదయం ఈదురు గాలులు రావడంతో క్లీనర్ మోహన్ లారీపైకి ఎక్కి పట్ట కప్పుతున్న క్రమంలో పట్టతో సహా కింద పడిపోయాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో కంపెనీ ఉద్యోగులు అంబులెన్సులో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ఈ మేరకు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎస్సీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పొదలకూరు : ఎస్సీ వర్గానికి చెందిన వారికి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ డీవీ నరసింహారావు బుధవారం తెలిపారు. ఈనెల 14 నుంచి మే నెల 10వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించుకోవాల్సిందిగా సూచించారు. లబ్ధిదారులు ఆధార్, రేషన్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కు లింకైన ఫోన్ నంబర్‌తో సచివాలయం లేదా మీ సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

- **తోటపల్లిగూడూరు** : ఎస్సీ కార్పొరేషన్ కింద రుణాల మంజూరు కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు బుధవారం కోరారు. మండలానికి 34 యూనిట్లు కేటాయించినట్లు వివరించారు.

పిల్లలను టీవీ, ఫోన్లకు దూరంగా ఉంచాలి


కొడవలూరు: పాతవంగల్లులో ర్యాలీ చేస్తున్న సీడీపీఓ జ్యోతి

కొడవలూరు: పిల్లలను టీవీ, ఫోన్లకు దూరంగా ఉంచాలని కోవూరు సీడీపీఓ జ్యోతి సూచించారు. మండలంలోని కొత్తవంగల్లులో ఐసీడీఎస్ సిబ్బందితో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని దూరం చేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయని చెప్పారు. తొలుత ఆమె తాటాకుల దిన్నెలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని గర్భిణులు, బాలింతలకు పోషకాహారంతో కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటరమణమ్మ, పద్మజ, విజయమ్మ, తాటాకులదిన్నెలో మహిళా పోలీసు బాదుల్లాబి, పంచాయతీ కార్యదర్శి మౌళిక, హెచ్‌ఎం మస్తాన్‌వలీ, అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ, కామేశ్వరి, ప్రసూన పాల్గొన్నారు.

- తలమంచిలోని అంగన్‌వాడీ కేంద్రం–3లో బుధవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల మాట్లాడుతూ పిల్లలకు ఆరు నెలల తరువాత నుంచి కాంప్లిమెంటరీ ఫీడింగ్ ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు హేమలత, పద్మావతి, సౌజన్య పాల్గొన్నారు.
- నార్తురాజుపాళెంలోని సీబీఎస్ కాలనీలో బాలింతలు, గర్భిణులు, పాదుపు మహిళలు, కిశోర బాలికలతో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల వల్ల ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్త మంజుల పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పొదలకూరు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని, మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి వెయ్యి రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ పేర్కొన్నారు. మండలంలోని మహ్మదాపురం, నేదురుమల్లి గ్రామాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా సమావేశం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిడ్డ పుట్టి రెండేళ్లు వచ్చేవరకు అంగన్‌వాడీ సెంటర్ పరిశీలిస్తుందన్నారు. బిడ్డ బరువు, ఎత్తును చూసి సాధారణ స్థితికి వచ్చే వరకు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. గర్భిణులు ఆకుకూరలు, కూరగాయలు, తాజా పండ్లను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న, ఏఎన్‌ఎం అనసూయ, ఆశా కార్యకర్తలు వెంకటసుబ్బమ్మ, పెంచలమ్మ, అంగన్‌వాడీ టీచర్లు విమలకుమారి, నర్మద, నాగలక్ష్మీకుమారి, సుమ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

తోటపల్లిగూడూరు : గర్భిణులు, బాలింతలు విధిగా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పేడూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా పాపిరెడ్డిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల సాధారణ బరువు తదితర అంశాలపై స్థానిక మహిళలకు బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్యకరంగా జన్మించాలన్నా, పుష్టికరంగా పెరగాలన్నా విధిగా తగిన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. తల్లులు చిన్నారుల సంరక్షణ కోసం మంచి ఆహారం తీసుకొంటూ ఆరోగ్యం సమస్యలు లేకుండా జాగ్రత్తలు పడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, కరుణకుమారి, సహాయకురాలు సుహాసిని, స్థానిక మహిళా పోలీస్ సునీత తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతకు చెక్

విడవలూరు : పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని రామచంద్రాపురం పాఠశాల హెచ్‌ఎం కె.యమున అన్నారు. మండలంలోని వావిళ్ల సెక్టార్ రామచంద్రాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పడాలన్నారు. చంటి పిల్లలకు తల్లి ముర్రుపాలు ఎంతో శ్రేష్ఠమన్నారు. అనంతరం మహిళా పోలీస్ శైలజ వివిధ రకాల పోషకాహార పదార్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆదిశేషమ్మ పాల్గొన్నారు.

ముర్రుపాలే బిడ్డకు తొలిటీకా

మనుబోలు : పుట్టిన బిడ్డకు ముర్రుపాలే తొలి టీకా అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మనుబోలు సీఎంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ఆవశ్యకత, బిడ్డ పుట్టిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గర్భిణులు, బాలింతలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు వచ్చే ముర్రుపాలు తప్పక తాగించాలని, కనీసం ఆరు నెలలైనా తల్లిపాలు పట్టించాలని సూచించారు. మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అనంతరం తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను ఎలా తయారు చేసుకోవాలో చూపించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీతారామమ్మ, అంగన్‌వాడీలు సుగుణమ్మ, నిర్మల, విజయమ్మ, లక్ష్మమ్మ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


తోటపల్లిగూడూరు : పాపిరెడ్డిపాళెంలో..


పొదలకూరు : సూచనలు చేస్తున్న సూపర్‌వైజర్


మనుబోలు సీఎం నగర్‌లో..

ఈకేవైసీ చేయించండి

ముత్తుకూరు : మండలంలో రైస్ కార్డుదారులకు ఈకేవైసీ చేయించేలా చొరవ చూపాలని తహసీల్దార్ స్వప్న సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, చౌకదుకాణ డీలర్లతో ప్రత్యేక సమావేశాన్ని ఆమె బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైస్ కార్డుదారుల్లో కొందరికి ఈకేవైసీ పెండింగ్‌లో ఉందన్నారు. చౌకదుకాణ డీలర్లు, రెవెన్యూ సిబ్బంది కలిసి రైస్ కార్డుదారులకు వంద శాతం ఈకేవైసీ చేయించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, వీఆర్వోలు, చౌకదుకాణ డీలర్లు పాల్గొన్నారు.

రైతుల పక్షాన పోరాడేందుకు సిద్ధం


చలపతిరావును మర్యాదపూర్వకంగా కలిసిన రైతు నాయకులు

కొడవలూరు : వైఎస్సార్‌సీపీతో కలిసి రైతుల పక్షాన పోరాడేందుకు తాము సిద్ధమని రైతు నాయకులు స్పష్టం చేశారు. నార్తురాజుపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావును బుధవారం వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంలో రైతులు పడుతున్న కష్టాల గురించి చలపతిరావుతో చర్చించారు. మొన్నటి వరకు టమోటా, మిర్చి, మొక్కజొన్న రైతులు మాత్రమే నష్టాలు పాలయ్యారని, ఇప్పుడు నల్ల బార్లీ, పొగాకు రైతులు కూడా నష్టాల ఊబిలో కూరుకుపోయారన్నారు. యూరియాకు సంబంధించి అనేక కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునే విధంగా చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాల్లో తామంతా భాగస్వాములమవుతామని స్పష్టం చేశారు.